సాక్షి
వికారాబాద్

గురువారం । 20 । జూన్ । 2024



అధికారులు లేక..

దోమ తహసీల్దార్ కార్యాలయంలో ఏడాదిగా ఖాళీగా ఉద్యోగాలు భర్తీ కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



జల్సాల కోసం..

జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



ఆరోగ్య 'సిరి'ధాన్యాలు

రెడీమేడ్ ఫుడ్‌కు అలవాటు పడిన జీవితాలు.. ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఎదురు చూస్తున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



అనంతగిరి: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను బుధవారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాలె గాయత్రి, శ్రీదేవి, రామస్వామి, రాములు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, రాజ్‌కుమార్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువ నాటకోత్సవాన్ని ఆదరించాలి

తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హరికృష్ణ

పరిగి: పట్టణంలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే తెలంగాణ యువ నాటకోత్సవ కార్యక్రమంలో కళాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం పరిగి పట్టణంలో యువ నాటకోత్సవ వాల్‌పోస్టర్‌ను నిర్వాహకుడు కావలి మనోహర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

23 నుంచి ధ్రువపత్రాల పరిశీలన



ప్రిన్సిపాల్ పరమేశ్వర్

అనంతగిరి: టీజీ పాలీసెట్ – 2024 పరీక్షలో అర్హత సాధించిన వారు కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పరమేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ప్రక్రియ సాగుతుందని వివరించారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్‌ఎస్‌సీ మెమో, స్కూల్ బోనఫైడ్, టీసీ, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, అధార్ కార్డు జిరాక్స్ కాపీల(రెండు సెట్లు)తో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చేవెళ్ల అభివృద్ధికి కృషి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆయనకు పౌరసన్మానం ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలో రావడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసి చూపుతానని పేర్కొన్నారు. అంతకుముందు బీజేఆర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కే మాధవరెడ్డి, ఎంపీ తనయుడు విశ్వజిత్‌రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, సదానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, విజయ్‌రాజ్, శ్రీకాంత్, కౌన్సిలర్ శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ సుచరిత, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిరీష, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బతుకు ఛిద్రం

గుర్తు తెలియని లారీ సృష్టించిన విధ్వంసంలో తల్లీకూతురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. లారీ చక్రాలు చిన్నారి పైనుంచి వెళ్లడంతో తల ఛిద్రమై మెదడు బయటకు వచ్చింది. వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలో బుధవారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

గుర్తు తెలియని లారీ ఢీకొని ఇద్దరి దుర్మరణం

- ఎనిమిది మందికి గాయాలు
- యాలాల మండలం కాగ్నా బ్రిడ్జి సమీపంలో ఘటన



ప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్లు అనిత, క్రితిక(ఫైల్)



ప్రాణాలతో బయటపడిన చిన్నారులు అంకిత్, దేవాన్ష్, అఖిల



తాండూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

యాలాల: ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం బయటకు వచ్చిన ఓ కుటుంబాన్ని.. లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఛిన్నాభిన్నం చేసింది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బంట్వారం మండలం సల్బాత్తాపూర్ గ్రామానికి చెందిన కోస్గి నర్సింహులు, అనిత(23) దంపతులకు దేవాన్ష్, క్రితిక(18 నెలలు) సంతానం. వీరు ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయించేందుకు మధ్యాహ్నం బైక్‌పై బంట్వారం చేరుకున్నారు. ఇక్కడ జనాలు ఎక్కువగా ఉండటంతో.. తమ బంధువులు ఉండే యాలాలకు వెళ్లి పని పూర్తి చేసుకున్నారు. అనంతరం నర్సింహులు తన భార్యా పిల్లలతో పాటు.. తన అన్న వెంకటయ్య పిల్లలైన అంకిత్, అఖిలను తీసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. ఇదే సమయంలో యాలాల మండలం జక్కేపల్లికి చెందిన బొల్ల బాల్‌రాజ్, లక్ష్మి దంపతులు తమ ఏడాది వయసున్న రాంచరణ్‌తో పాటు బంధువైన వెంకటమ్మతో కలిసి బైక్‌పై తాండూరు నుంచి జక్కేపల్లికి వెళ్తున్నారు. తాండూరు కాగ్నా కొత్త బ్రిడ్జి సమీపంలో లక్ష్మీనారాయణపూర్ వైపు వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన ఓ లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. ఎదురుగా వస్తున్న నర్సింలు తన కళ్ల ముందే లారీ.. బైక్‌ను ఢీకొట్టడాన్ని గమనించి, తన బైక్‌ను ఆపే ప్రయత్నంలో బ్రేక్ వేశాడు. ఈ సమయంలో వాహనం అదుపు తప్పి వెనకాల కూర్చున్న అనిత, క్రితిక రోడ్డు మధ్య ఎగిరి పడగా.. నర్సింలుతో పాటు మిగిలిన ముగ్గురు పిల్లలు రహదారి పక్కన పడిపోయారు. రోడ్డుపై పడిపోయిన అనిత, క్రితిక పైనుంచి లారీ దూసుకెళ్లడంతో ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. లారీ చక్రాలు చిన్నారి తల పైనుంచి వెళ్లడంతో మెదడు బయటకు వచ్చింది. మృతదేహాలను తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా ఎదురుగా వచ్చిన లారీ తన బైక్‌ను సైతం ఢీకొట్టిందని నర్సింలు తెలిపాడు.

లారీని ఆపకుండా డ్రైవర్ పరార్

ఇద్దరి ప్రాణాలను పొట్టన పెట్టుకోవడంతో పాటు మరో ఎనిమిది మందికి గాయాలయ్యేందుకు కారణమైన డ్రైవర్ మాత్రం లారీని ఆపకుండా పరారయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న యాలాల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లారీని పట్టుకునేందుకు కొడంగల్, తాండూరు మార్గాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



చిన్నపాటి వర్షానికే వికారాబాద్‌లోని రోడ్డుపైకి చేరిన మురుగు

పడకేసిన పాలన

చైర్‌పర్సన్లు, కౌన్సిలర్ల మధ్య కొరవడిన సఖ్యత

- సమస్యలను గాలికొదిలేసిన వైనం
- పట్టణాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త పారబోత
- రోడ్లపై పారుతున్న మురుగు
- అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి
- పట్టించుకోని కమిషనర్లు

వికారాబాద్: పట్టణాల్లో పాలన పడకేసింది. కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు ఒకరితో ఒకరు పంచాయితీ పెట్టుకోవటం తప్ప పాలనపై దృష్టి సారించడం లేదు. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కాలనీల్లో, ఇళ్ల మధ్య, రోడ్లపై మురుగు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్ అధికారులు ఆడిందే ఆటా.. పాడిందే పాట అన్నట్లు తయారైంది. కాలనీలు కుళ్లిన చెత్తతో కంపుకొడుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఈగల మోత ఎక్కువైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళనకు చెందుతున్నారు.

పట్టణ ప్రగతి పేరుతో హడావుడి

పట్టణ ప్రగతి పేరుతో అప్పుడప్పుడు మున్సిపల్ అధికారులు హడావుడి చేసి ఆ తరువాత మిన్నకుండిపోతున్నారు. కార్యక్రమం ప్రారంభం రోజు వీధుల్లో తిరుగుతూ మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశిస్తున్నారు. వార్డుల్లో చెత్తను దగ్గరుండి తొలగిస్తున్నారు. తరువాత ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో చెత్త యథావిధిగా పేరుకుపోతోంది. పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. తడి పొడి చెత్తను ఒకేచోట నిల్వ చేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు తెలిపారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవటంతో మురుగు ముందుకు సాగడం లేదు. పలు చోట్ల వీధులు, రోడ్లపై ప్రవహిస్తోంది.

పరిష్కారానికి నోచుకోని సమస్యలు

పురపాలక సంఘాల పరిధిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. చెత్త కారణంగా కాలనీలు కంపుకొడుతున్నాయి. నివాసాల మధ్య మురుగు పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పారిశుద్ధ్య సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఒక్కో మున్సిపాలిటీలో అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం లోపించింది. తడి పొడి చెత్త కోసం మున్సిపల్ అధికారులు బుట్టలు ఇస్తున్నా ప్రజలు వేరు చేసి ఇవ్వడం లేదు. అవగాహన కల్పించడంలో సిబ్బంది విఫలమవుతున్నారు.

ఆగిన ఎరువుల తయారీ

గతంలో తాండూరు, పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీల్లో కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్లు నెలకొల్పారు. ఇక్కడ తయారు చేసిన ఎరువులను పట్టణ ప్రకృతి వనాల్లో, నర్సరీల్లో మొక్కలకు వాడేవారు. ప్రస్తుతం ఎరువుల తయారీ ఆగిపోయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పాలనపై దృష్టి సారించాలని, అలాగే పారిశుద్ధ్యం పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'గృహజ్యోతి' వెలిగేనా?

- పథకం అమలు కోసం భారీగా దరఖాస్తులు
- జీరో కరెంటు బిల్లు వచ్చేలా చూడాలని విన్నపం

యాలాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గృహజ్యోతి పథకం కోసం అర్హులు ఆశగా ఎదురు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పథకం అమలవుతుండటంతో తమకు కూడా జీరో కరెంటు బిల్లు అమలు చేయాలని మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా ఈ పథకం అమలైనా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు, అనంతరం ఎంపీ ఎన్నికల రావడంతో మండలంలో ప్రారంభం కాలేదు. ప్రజాపాలన కార్యక్రమంలో చాలా మంది అర్హులు దరఖాస్తు చేశారు. ఎవ్వరికీ పథకం అమలు కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసి చాలా రోజులు కావడంతో పథకం వర్తిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అనేక సందేహాలు

కొన్ని గ్రామాల్లో కుటుంబ పెద్ద పేరిట చాలా ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఉన్నాయి. సదరు వ్యక్తి చనిపోయినా మీటర్లు మాత్రం ఆయన పేరిటే ఉన్నాయి. గృహజ్యోతి పథకం అమలు కావాలంటే దరఖాస్తు దారుడి ఆధార్ కార్డు, రేషన్ కార్డులో పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సమస్య ఎదురవుతోంది. ఒకవేళ విద్యుత్ మీటర్‌ను తమ పేరు మీద మార్చుకుందామంటే ఇది తొందరగా అయ్యే పని కాదు. గతంలో ఉమ్మడి కుటుంబంలో ఉండి, ప్రస్తుతం అదే ఇంట్లో వేర్వేరుగా కాపురం ఉన్న వారు పథకం ఎలా పొందాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు.

> **ఉన్నతాధికారులకు వివరిస్తాం**
>
> గృహజ్యోతి పథకం అమలు చేయాలంటూ పలువురు కార్యాలయానికి వస్తున్నాయి. అయితే విద్యుత్ మీటర్లు, యజమానుల పేర్లు, రేషన్ కార్డుల్లో వివరాలు, సెల్ ఫోన్ నంబర్లు తదితర అంశాల్లో రకరకాల సమస్యలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో ఒకటే ఆప్షన్ ఉండటంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.
>
> – యాదయ్య, ఎంపీఓ



గృహజ్యోతి పథకం అమలు చేయాలని ఎంపీపీని కోరుతున్న ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో నారాయణపేట్ కలెక్టర్ సిక్తా పట్నాయక్

పనుల వేగం పెంచండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- 'కడ' పనులపై నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల కలెక్టర్ల సమీక్ష

అనంతగిరి: కడ అభివృద్ధి (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై నారాయణపేట్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ అభివృద్ధిని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అధికారులు వారికి నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను ప్రారంభించాలని సూచించారు. రోడ్ల విస్తరణ, మరమ్మతులపై పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలు దృష్టి సారించాలని పేర్కొన్నారు. కళాశాలల భవన నిర్మాణాల కోసం స్థలాలు సేకరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కొడంగల్‌లో నిర్మించే అతిథి గృహానికి సంబంధించిన నమూనాను తయారు చేసి టెండర్లు పిలవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల కోసం భవనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అర్హులకు గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందాలని చెప్పారు. వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. చెక్ డ్యాంల నిర్మాణం, అటవీ భూముల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. కొడంగల్ నియోజకవర్గానికి మంజూరైన గురుకుల పాఠశాలలు ఇక్కడా ఉండేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీకి లాభాలు

హైదరాబాద్ జోన్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర రావు

ఇబ్రహీంపట్నం: ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగానే ఆర్టీసీ లాభాలబాట పడుతుందని హైదరాబాద్ జోన్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం డిపోలో రీజినల్ పరిధిలోని 14 డిపోలకు చెందిన 29 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రం త్రైమాసిక అవార్డు పురస్కారాలను అందజేశారు. స్థానిక డిపో మేనేజర్ వెంకట నర్సప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్ రీజినల్ పరిధిలోని అన్ని డిపోలు అన్ని విభాగాల్లో ముందంజలో ఉన్నాయన్నారు. ఇందుకు ఉద్యోగుల సమష్టి కృషి కారణమన్నారు. మరింత అంకితభావంతో పనిచేసి ఆర్టీసీని అగ్రగామిగా నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజినల్ మేనేజర్ బి.వరప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మెకానిక్ జగన్, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, ఎంఎఫ్ సత్తయ్య, పలు డిపోల మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'పట్నం' కట్ట సుందరీకరణకు..

- రూ.20కోట్ల నిధులు
- తైబజార్ టెండర్ నిలిపేశాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్టను రూ.20 కోట్లు వెచ్చించి సుందరీకరణకు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, ఆర్ అండ్ బీ అధికారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారి సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువు నిండా నీరున్నందున కంప చెట్ల తొలగింపునకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించామన్నారు. చెరువులో పడి మృతి చెందకుండా ఒక చానల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. నగరానికి సమీపంలో ఉన్నందున చెరువు సుందరీకణకు నిధులను వెచ్చిస్తామన్నారు. శ్రీఇందు కళాశాల ఎదుట అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

అక్రమ వసూళ్లకు కళ్లెం

ఇబ్రహీంపట్నంలో తైబజార్ పేరుతో అక్రమంగా వసూళ్లకు తెరలేపారని.. దీనికి అడ్డుకట్టవేసేందుకు తైబజార్ టెండర్ నిలిపివేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ సాలీనా రూ.12లక్షలు చెల్లిస్తూ సుమారు రూ.80 లక్షల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తైబజార్‌ను నిలిపివేసి చిరు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

క్లుప్తంగా

రైతుల ఖాతాల్లో నిధుల జమ హర్షణీయం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకట్‌

తాండూరు టౌన్‌: రైతులకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ బీజేపీయేనని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రాగానే రైతుల ఖాతాల్లోకి రూ. 2 వేల చొప్పున పీఎం కిసాన్‌ యోజన నిధులు జమ చేయడం హర్షణీయమన్నారు. అంతే కాకుండా రైతులకు సబ్సిడీపై ఎరువుల పంపిణీ, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం బీజేపీకే చెల్లిందన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఆగస్టు లోపు విడతల వారీగా రుణమాఫీ చేస్తామని చెప్పడం విడ్డూరమన్నారు.


కోట్‌పల్లి మార్కెట్‌ అభివృద్ధికి సహకరించండి



గడ్డం ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పెద్దేముల్‌: స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ను బుధవారం వికారాబాద్‌ జిల్లా కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ గడ్డకింది అంజయ్య, వైస్‌ చైర్మన్‌ సాయిని నారాయణరెడ్డితో పాటు డైరెక్టర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. కోట్‌పల్లి మార్కెట్‌ అభివృద్ధికి కృషి చేయాలని స్పీకర్‌ని కోరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో హరివర్ధన్‌రెడ్డి, ఏగ్బాల్‌, అక్బర్‌, బందెప్ప, నర్సిములు, రమేశ్‌, రియాజోద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో కోటిరెడ్డి కృషి అమోఘం



బదిలీ అయిన ఎస్పీ కోటిరెడ్డిని కలిసిన ఆనంద్‌

అనంతగిరి: జిల్లాలో గత రెండున్నర ఏళ్ల పాటు ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీ అయిన కోటిరెడ్డిని బుధవారం ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్‌ ఆనంద్‌ వికారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నేరాల అదుపునకు తీసుకున్న చర్యలను గుర్తు చేశారు. ఏ విషయంలోనైనా వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేశారని ఎస్పీని కొనియాడారు.

అనుమతుల్లేని ఎరువుల సీజ్‌

కొడంగల్‌లో ఏఓ లావణ్య తనిఖీ



దుకాణం యజమానికి నోటీస్‌ ఇస్తున్న ఏఓ లావణ్య

కొడంగల్‌ : పట్టణంలోని వైష్ణవి ఏజెన్సీస్‌ ఫర్టిలైజర్‌ అండ్‌ పెస్టిసైడ్స్‌ దుకాణాన్ని వ్యవసాయ శాఖ ఏఓ లావణ్య బుధవారం తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న ఎరువులను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అనుమతి లేకుండా ఎరువులను విక్రయిస్తున్నారని గుర్తించారు. అనుమతి లేని ఎరువుల విక్రయాలు నిలిపి వేయాలని దుకాణం యజమానికి నోటీస్‌ ఇచ్చారు. డీఏపీ 68 మెట్రిక్‌ టన్నులు, యూరియా 88 మెట్రిక్‌ టన్నులు, ఎస్‌ఎస్‌పీ 13 టన్నుల ఎరువులను ఆమె సీజ్‌ చేశారు. వాటిని విక్రయించరాదని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రక్త హీనతను నివారిద్దాం

జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్‌



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్‌

పెద్దేముల్‌: మండలంలోని చైతన్యనగర్‌లో జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్‌ నేషనల్‌ సికిల్‌ సెల్‌ ఎనీమియా నివారణ మిషన్‌పై అవగాహన ర్యాలీని బుధవారం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సికిల్‌ సెల్‌ ఎనీమియాను నిర్మూలించడానికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా ఆదివాసీ సముదాయాలకు చెందిన ప్రజల జీవితాలను రక్తహీనత నుంచి విముక్తి చేసి ఆరోగ్య భద్రత కల్పించడమే ఈ అవగాహన ముఖ్య ఉద్దేశమని డీఎంహెచ్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి బుచ్చిబాబు, ఇన్‌చార్జి ఎంపీఓ రమేశ్‌, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేక.. పనులు సాగక

- రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు
- పనులు కదలక చుట్టూ జనాల ప్రదక్షిణలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం





దోమ తహసీల్దార్‌ కార్యాలయం

దోమ: ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలే దర్శనం ఇస్తున్నాయి. పనుల నిమిత్తం దోమ మండలానికి వచ్చే ప్రజలకు ఆయా కార్యాలయాల్లో అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో జనాలకు సక్రమంగా పనులు జరగక నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయాల్లోనే నిరీక్షించిన ఫలితం లభించడం లేదని మండి పడుతున్నారు. సంబంధిత అధికారులకు విషయం తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఐదు పోస్టులు ఖాళీ

మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. ఇందులో డిప్యూటీ తహసీల్దార్‌, సీనియర్‌ అసిస్టెంట్‌, జూనియర్‌ అసిస్టెంట్‌తో పాటు టైపిస్ట్‌, సర్వేయర్‌ పోస్టులు గతేడాది నుంచి ఖాళీగా ఉన్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన డిప్యూటీ తహసీల్దార్‌ను తాండూరుకు బదిలీ చేసినప్పటికీ ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా నుంచి మరో అధికారిని నియమించారు. అయితే వివిధ కారణాలతో తహసీల్దార్‌, డిప్యూటీ తహసీల్దార్‌ మధ్య సమన్వయం లోపించడంతో ఉన్నతాధికారులు నూతనంగా వచ్చిన డిప్యూటీ తహసీల్దార్‌ను కొడంగల్‌కు బదిలీ చేశారు. సీనియర్‌ అసిస్టెంట్‌ పోస్టు సైతం ఏడాది కాలంగా ఖాళీ ఉండడంతో అట్టి పనులను ఆర్‌ఐలే చూసుకుంటున్నారు. ఇక్కడ పని చేసే జూనియర్‌ అసిస్టెంట్‌ వివిధ కారణాలతో డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు తెలుస్తోంది. గతంలో పని చేసిన టైపిస్ట్‌ దౌల్తాబాద్‌ మండలానికి ప్రమోషన్‌పై వెళ్లడడంతో అప్పటికి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. మండలంలో సర్వేయర్‌ సమస్య తీవ్రంగా ఉంది. కొన్నేళ్లుగా సర్వేయర్‌ లేక భూ సర్వే దరఖాస్తులు కార్యాలయంలో పేరుకుపోయాయి.

పెరిగిన పని భారం

తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారుల కొరత ఏర్పడడంతో తహసీల్దార్‌, ఇద్దరు ఆర్‌ఐలకు పని భారం పెరిగింది. నూతనంగా ప్రమోషన్లపై వచ్చిన జూనియర్‌ అసిస్టెంట్‌లు, రికార్డు అసిస్టెంట్‌లతో అధికారులకు కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీఆర్‌ఏ స్థాయి నుంచి రావడంతో పనులు నిర్వహించడంలో కాస్త ఒత్తిడికి గురవుతున్నారు. వారిని సరి చేసుకుంటూ అధికారులు పనులు నిర్వహించాల్సి వస్తోంది. నిత్యం తహసీల్దార్‌ కార్యాలయానికి వందల సంఖ్యలో రైతులు, విద్యార్థులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అయితే అధికారులు లేకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలోనే ఉంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులను నియమించాలి



తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారులు లేక పనులు సక్రమంగా జరగడం లేదు. నిత్యం గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు కార్యాలయానికి వస్తున్నారు. అక్కడ వారికి పనులు జరగక వెనుదిరుగుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– ఖాజపాషా, మండల కో ఆప్షన్‌ సభ్యుడు, దోమ

ఉన్నతాధికారులకు నివేదించాం



కార్యాలయంలో సరైన సిబ్బంది లేని విషయం వాస్తవమే. డిప్యూటీ తహసీల్దార్‌, సీనియర్‌ అసిస్టెంట్‌, జూనియర్‌ అసిస్టెంట్‌తో పాటు టైపిస్ట్‌, సర్వేయర్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజలకు కాస్త ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– పురుషోత్తం, తహసీల్దార్‌, దోమ

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌



ఎంపీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

ధారూరు: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే గ్రామ పంచాయతీ కార్మికులకు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.మహిపాల్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం ఆయన గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ధారూరు మండల పరిషత్‌ కార్యాలయం ముందు బైఠాయించి ఎంపీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి నెలకు రూ.26 వేల వరకు జీతం ఇవ్వాలన్నారు. ప్రమాదబీమా రూ.10 లక్షల వరకు ఇవ్వాలని, ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. పంచాయతీ కార్మికులకు ఇంత వరకు ఐదు నెలల వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ వర్కర్లకు నెలనెల జీతాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 25న కలెక్టర్‌ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాకు కార్మికులందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అంజిలయ్య, మల్లేశం, పెంటయ్య, రవికుమార్‌, అనంతయ్య, గోపాల్‌, గోపాల్‌, లక్ష్మణ్‌, వెంకటయ్య, మోతీలాల్‌, రాములు తదితరులు పాల్గొన్నారు.

23న వికారాబాద్‌లో ఉద్యోగ మేళా

బంట్వారం: యువజన సర్వీస్లు, టీజీస్టెప్‌ ఆధ్వర్యంలో ఈ నెల 23న వికారాబాద్‌ పట్టణంలోని గౌలీకర్‌ నర్సింగ్‌ ఫంక్షన్‌ హాల్‌లో మెగా జాబ్‌ మేళా నిర్వహిస్తారని ఎంపీడీఓ రాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 60కి పైగా కంపెనీలు, 5వేలకు పైగా ఉద్యోగాలు ఉన్నాయన్నారు. 7వ తరగతి నుంచి పీజీ వరకు ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్హతలను బట్టి ఉద్యోగాల్లో ఎంపిక చేస్తారన్నారు. 18–35 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌ మేళా సువర్ణావకాశం అన్నారు. మరిన్ని వివరాల కోసం 9030047303, 9642333668 నంబర్లను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

బొకేలు, శాలువాలు వద్దు

కలెక్టర్‌ ప్రతిక్‌ జైన్‌



అనంతగిరి: బొకేలు, శాలువాలతో కాకుండా పెన్నులు, పుస్తకాలతో కలవాలని కలెక్టర్‌ ప్రతిక్‌ జైన్‌ కోరారు. వికారాబాద్‌ జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్‌ని కలిసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు శాలువాలు, బొకేలతో వస్తున్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బుధవారం కలెక్టర్‌.. శాలువాలు, బొకేలతో కాకుండా పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోటు పుస్తకాలు, పెన్నులు ఇతర స్టేషనరీతో రావాలని విజ్ఞప్తి చేశారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు



మల్లేశం

అనంతగిరి: బెస్ట్‌ అవైలబుల్‌ ఇంగ్లిష్‌ మీడియం పాఠశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి రెండో దఫా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 91 సీట్లకు గాను మొదటి విడతలో 23 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని, మిగిలిన 68 సీట్ల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 26వ వరకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం రూం నంబర్‌ ఎఫ్‌– 10లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

బాలిక కిడ్నాప్‌ కేసులో ఐదేళ్లు జైలు శిక్ష

మంచాల: బాలికను కిడ్నాప్‌ చేసి ప్రేమ పేరుతో వేధించిన యువకుడికి ప్రత్యేక పోక్సో కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మంచాల ఎస్‌ఐ రవినాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం... మంచాల మండలంలోని నోముల గ్రామంలోని ఆయిల్‌ మిల్‌ కంపెనీలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బల్లీయా ప్రాంతానికి చెందిన విశాల్‌ బిందు అనే యువకుడు పని చేసే వాడు. 2022లో పని చేసే చోట ఓ బాలికను కిడ్నాప్‌ చేసి, ప్రేమ పేరుతో వేధించిన ఘటనలో పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పోక్సో కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష , రూ.20వేలు జరిమానా విధించింది. అదే విధంగా బాధిత బాలికకు ప్రభుత్వం నుంచి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించాలని తీర్పు నిచ్చింది.

పోరాటాలను క్షేత్రస్థాయిలో వివరించాలి

ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌

కొడంగల్‌ రూరల్‌: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల, గ్రామ కమిటీల సభ్యులు ఆవిర్భావ వేడుకలు నిర్వహించుకోవాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్‌ సూచించారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్‌ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎమ్మార్పీఎస్‌ చేసిన పోరాటాలను గ్రామస్థాయిలో వివరించాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ 30 ఏళ్ల కల సాకారం అవుతున్న తరుణంలో మాదిగ, ఉప కులాల ప్రజలకు సమాచారాన్ని చేరవేసేందుకు కృషి చేయాలని తెలిపారు. జులై 7న వరంగల్‌ వేదికగా జరిగే మాదిగల ఆత్మ గౌరవ కవాతును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్కప్పమాదిగ, జిల్లా కార్యదర్శి అంజి మాదిగ, ఎంఎస్‌ఎఫ్‌ జిల్లా కన్వీనర్‌ శివాజీ, కొడంగల్‌ మండల అధ్యక్షుడు అశోక్‌, నాయకులు నరేందర్‌, సిద్ధు, వెంకట్‌, బాలు, శ్రీనివాస్‌, నరేష్‌, నసీర్‌, మహేష్‌, రాములు, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

రాజకీయ కక్షతోనే చేశారని బీఆర్‌ఎస్‌ నేతల ఆరోపణ



ముక్కలుగా పడిన శిలాఫలకం

పరిగి: గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియ వ్యక్తులు ధ్వంసం చేశారు. మండల పరిధిలోని కాళ్లాపూర్‌ గ్రామంలో గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు పనులు చేపట్టగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేరుతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో బుధవారం స్థానిక నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావాలనే కక్షపూరితంగా కొందరు ధ్వంసం చేశారని బీఆర్‌ఎస్‌ నాయకులు ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని అవి కనిపించకుండా చేయాలని కక్ష కట్టి శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. పోలీసులు విచారణ చేసి శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చోరీ చేసిన దంపతులకు రెండేళ్ల జైలు

యాచారం: వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న ఓ మహిళ రైతు మెడలో పుస్తెల తాడు చోరీకి పాల్పడిన దంపతులకు బుధవారం ఇబ్రహీంపట్నం న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. యాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2018 అక్టోబర్‌ 4న తక్కళ్లపల్లి తండాకు చెందిన అంగోత్‌ జంకు తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుంది. అటుగా బైక్‌పై వచ్చిన సరూర్‌నగర్‌కు చెందిన నందిపాటి వినోద్‌, కీర్తన అనే దంపతులు దాహం వేస్తుందని నీళ్లు అడిగారు. జంకు నీళ్లు ఇచ్చే సమయంలో దంపతులు ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కున్నారు. కిందపడిపోయిన జంకు తేరుకునే లోపే అక్కడి నుంచి వారు పరారయ్యారు. జంకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న యాచారం పోలీసులు సీసీ పుటేజ్‌ ఆధారంగా పుస్తెల తాడు చోరీకి పాల్పడింది వినోద్‌, కీర్తన దంపతులేనని గుర్తించి పూర్తి వివరాలతో ఇబ్రహీంపట్నం న్యాయస్థానానికి అందజేశారు. పరిశీలించిన కోర్టు బుధవారం వినోద్‌, కీర్తన దంపతులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించింది.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



స్వాధీనం చేసుకున్న బైకులు

జల్సాల కోసం.. బైకుల చోరీ

- ద్విచక్ర వాహనాలను అపహరించిన నలుగురి అరెస్టు
- ఆరు బైకులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

తాండూరు టౌన్‌: జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. ఈ మేరకు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి బుధవారం పట్టణ సీఐ సంతోష్‌ కుమార్‌, ఎస్సైలు కాశీనాథ్‌, రాములుతో కలిసి తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన బంట్వారం మండలం కల్‌కుంద గ్రామానికి చెందిన బోయిని సత్యనారాయణ పట్టణంలోని ఇందిరాచౌక్‌ వద్ద గల మినార్‌ టీ పాయింట్‌ ఎదుట తన బైకును నిలపగా, గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు ఆయన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక విలియం మూన్‌ చౌరస్తా వద్ద పట్టణ ఎస్సై కాశీనాథ్‌, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఎలాంటి పత్రాలు లేకుండా బైకును నడుపుతున్న పట్టణంలోని గ్రీన్‌సిటీకి చెందిన అడిగోల్ల వంశీకృష్ణగౌడ్‌, అంతారం గ్రామానికి చెందిన బొడ్డే జశ్వంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల విషయమై ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. దీంతో అనుమానించిన పోలీసులు వారిని విచారించగా బైకును దొంగిలించినట్లు అంగీకరించారు. మరో ఇద్దరు మైనర్‌ బాలురతో కలిసి మొత్తం ఆరు బైకులను దొంగిలించామన్నారు. వికారాబాద్‌లో రాయల్‌ ఇన్‌ఫీల్డ్‌, యాలాల మండలం లక్ష్మీనారాయణ పూర్‌ చౌరస్తాలో స్ప్లెండర్‌, పట్టణంలోని మిత్రనగర్‌లో రాయల్‌ ఇన్‌ఫీల్డ్‌, స్ప్లెండర్‌, దిల్‌సుఖ్‌నగర్‌లో రెండు పల్సర్‌ బైకులను తస్కరించామని చెప్పారు. ఈ మేరకు వారి ఇళ్లల్లో దాచిపెట్టిన ఆరు బైకులను స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. అలాగే నిందితులను పట్టుకున్న ఎస్సైలు కాశీనాథ్‌, రాములు, హెడ్‌కానిస్టేబుల్‌ రామకృష్ణ, అమ్జద్‌, కానిస్టేబుళ్లు శివకుమార్‌, సాయప్ప, షబీల్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన వాహనం

యాలాల: ఇసుక తరలింపునకు తాండూరు మండలంలో అనుమతులు పొంది.. యాలాల మండల పరిధిలోని కాగ్నా నది నుంచి ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన ఆరు ట్రాక్టర్లు అదే మండలంలో ఉన్న కాగ్నా నది నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు తీసుకున్నారు. కానీ యాలాల మండల పరిధిలోని బెన్నూరు కాగ్నా నది నుంచి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేసి ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వాహనాలను పీఎస్‌కు తరలించారు. పట్టుబడ్డ వాహనాలను యాలాల రెవెన్యూ అధికారులకు అప్పగించగా, ఒక్కో ట్రాక్టరుకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్‌..

అక్రమంగా మొరం (ఎర్రమట్టి) తరలిస్తున్న ఓ టిప్పర్‌ను యాలాల పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని బషీర్‌మియా తండా సమీపంలో నుంచి మొరంను అక్రమంగా టిప్పర్లలో తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఓ టిప్పరులో మొరం ఉండగా పోలీసులు పట్టుకొని పీఎస్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌కు ఇతరుల అవసరం లేదు

చేవెళ్ల ఎమ్మెల్యే పార్టీ మార్పు ప్రయత్నంపై హస్తం నేతల మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

నవాబుపేట: కేవలం వ్యక్తిగత లాభం కోసమే ఎమ్మెల్యే కాలే యాదయ్య బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోనికి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ఆరోపించారు. బుధవారం నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 2014లో కాంగ్రెస్‌ పార్టీ తరఫున గెలిచిన యాదయ్య డబ్బుల కోసం, కుటుంబ సభ్యులకు పదవులు దక్కించుకోవడం కోసం నాటి టీఆర్‌ఎస్‌లోకి వెళ్లాడన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌ అధికారంలో లేకపోవడంతో అధికార పార్టీలోకి రావడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాడన్నారు. కాంగ్రెస్‌ పార్టీకి ఎవరి అవసరం లేదన్నారు. చేవెళ్ల ఇన్‌చార్జి భీం భరత్‌ ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బి బ్లాక్‌ అధ్యక్షుడు మధుసూదన్‌ రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస రెడ్డి, శ్రీధర్‌, బందయ్య, యాదగిరి, సంగారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా వాహనాలు ఢీ

ఇద్దరికి గాయాలు

మోమిన్‌పేట: ఎదురెదురుగా వస్తున్న కారు, బైకు ఢీకొట్టుకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం సాయంత్రం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెల్‌చాల్‌ గ్రామానికి చెందిన అంజయ్య తన భార్య మాధవి, కుమారుడు మణితేజతో కలిసి బైకుపై మోమిన్‌పేటకు వస్తున్నారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన గొల్ల అంజయ్య తన మనవరాలిని గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు వికారాబాదుకు కారులో వెళ్తున్నారు. మొరంగపల్లి సమీపానికి రాగానే కారు, బైకు ఎదురెదురుగా ఢీకొట్టుకొన్నాయి. దీంతో మాధవి తలకు బలమైన గాయం కాగా, మణితేజకు కాళ్లు విరిగాయి. చికిత్స నిమిత్తం వారిని 108 వాహనంలో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి చేయూత

చేవెళ్ల: మండలంలోని ఆలూరు సబ్‌స్టేషన్‌లో పని చేసే ఆపరేటర్‌ ఇటీవల హత్యకు గురికావటంతో అతని కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆపన్న హస్తం అందించడం హర్షణీయమని చేవెళ్ల ఏడీ స్వామి అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వద్ద బుధవారం ఇటీవల హత్యకు గురైన హరియానాయక్‌ కుటుంబానికి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి చేయుతనందించేందుకు విద్యుత్‌ ఉద్యోగుల సంఘం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఏఈ జానీమోయిన్‌ద్దీన్‌, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రంగుల చీర కట్టి.. పంటకు రక్షపెట్టి

ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు అడవి జంతువుల నుంచి పంటను కాపాడుకోవడం కత్తి మీద సామే. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రైతన్న మొత్తం ద్యాసను పంటపైనే కేంద్రీకరిస్తారు. ఈ క్రమంలో వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. ఓ రైతు రంగురంగుల చీరలతో పొలం చుట్టూ ప్రహరీని నిర్మించి అడవి పందుల బారి నుంచి పంటను రక్షించుకుంటున్న తీరు స్థానికులకు ఆచరణీయం. ఇదీ మండలంలోని గౌరారం సమీపంలో ఓ పొలంలోని దృశ్యం.

– దుద్యాల్‌